ఆలస్యంగా భోజనం చేస్తున్న విద్యార్థులు

వంట మనుషులు, ప్రిన్సిపాల్ మధ్య తగాదా

- వసతి గృహంలో మధ్యాహ్న భోజనం ఆలస్యం
- ఆకలితో అలమటించిన విద్యార్థులు

పెబ్బేరు, జూన్ 24: పెబ్బేరులోని మహాత్మా జ్యోతీరావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో మంగళవారం విద్యార్థులు కొన్నిగంటల పాటు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంట చేసే విషయంలో ప్రిన్సిపాల్‌కు, వంట మనుషులకు మధ్య తగాదా చోటు చేసుకోవడంతో వారు వంట చేయకుండా వెళ్లిపోయారు.

దీంతో వంట కాంట్రాక్టర్ బయటి నుంచి వంట మనుషులను తీసుకొచ్చి వండించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తినాల్సిన విద్యార్థులు 3:30గంటలకు భోజనం చేయాల్సి వచ్చింది.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే అనుకూలం

పెబ్బేరు మండలంలో కార్యకర్తలతో సమావేశమైన నాయకులు

పెబ్బేరు, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, అందుకే రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే అనుకూల వాతావరణం ఉంటుందని పెబ్బేరు మండల నాయకులు తెలిపారు. ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు గానూ మంగళవారం వారు సూగూరు, కొత్తసూగూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల హంగామా చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, దిలీప్‌రెడ్డి, సత్యారెడ్డి, ఈశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

రేవల్లి మండలంలో..

రేవల్లి,జూన్ 24 : మండలంలోని తల్పునూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందని వారి మాటలు నమ్మి మళ్లీ గోస పడొద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భీమన్న, మాజీ ఎంపీపీ సేనాపతి, శివరాం రెడ్డి, ఉత్తమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నాయకులు కాశన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

పుస్తకాలను విద్యాశాఖ అధికారులకు చూపిస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

గద్వాలటౌన్/గద్వాల రూరల్, జూన్ 24 : పుస్తకాలను విచ్చలవిడిగా అధిక ధరలకు అమ్ముకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కుర్వపల్లయ్య డిమాండ్ చేశారు. శ్రీచైతన్య పాఠశాలకు సంబంధించిన పుస్తకాలను జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీలో విక్రయిస్తున్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్‌వీ నాయకులు మంగళవారం తనిఖీ చేశారు. పుస్తకాలు దొరకడంతో ఎంతోవో శ్రీనివాస గౌడ్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడికి చేరుకొని పుస్తకాలు అమ్ముతున్న కార్యాలయాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా కుర్వపల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అమ్ముతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకే కొన్ని పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారన్న విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహదేవ్, యువరాజ్, నర్సింహ, మహేశ్ పాల్గొన్నారు.

141మంది యువకులకు సొంత ఖర్చులతో ఇన్సూరెన్స్

ఏదులలో గ్రామ యువకులకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయిస్తున్న సుఖేందర్‌రెడ్డి

గోపాల్‌పేట, జూన్ 24 : ఏదుల మండలకేంద్రానికి చెందిన పందెం సుఖేందర్‌రెడ్డి సొంత ఖర్చుతో మంగళవారం గ్రామ యువకులకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్ అధికారులు భూమన్న, గోపీనాథ్, ఐపీపీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ద్వారా తమ సొంత ఖర్చుతో 141మంది యువకులకు వ్యక్తిగత ప్రమాద బీమా చేయించినట్లు తెలిపారు. అనంతరం ఐపీపీ బ్యాంక్ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఏడాదికి రూ. 565 చెల్లిస్తే రూ. 10లక్షల బీమా ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో రాములు, సుఖేందర్‌రెడ్డి గ్రామంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

బోరవెల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్

గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

మానవపాడు, జూన్ 24 : మండలంలోని బోరవెల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఎస్పీ ఆదేశానుసారం అలం పుల్ సీఐ రవి బాబు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. కోదండాపురం ఎస్సై మురళి, పీఎస్సైలు, అలం పుల్ సర్కిల్ పరిధాలోని సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 64 బైక్‌లు, ఆరు ఆటోలను, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం సీఐ రవిబాబు గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

క్షయవ్యాధిని పారదోలేందుకు చర్యలు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, జూన్ 24 : భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో జిల్లా వ్యాప్తంగా 8059 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం కలెక్టర్లతో వీసీ నిర్వహించి వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల నిల్వలు, ఆయిల్ పాం సాగు, భూ భారతి, సీజనల్ వ్యాధుల నిర్మూలనపై సమీక్ష నిర్వహించారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్ వివరిస్తూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా నోటీస్‌లు జారీ చేసి దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకున్నామని, అనుమానిత ప్రజలను గుర్తించి వారికి తేమడ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 567మంది క్షయవ్యాధి గ్రస్తులకు క్రమం తప్పకుండా వైద్యం, మందులు ఇవ్వడమే కాకుండా వారికి అంత్యోదయ కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే వన మహోత్సవంలో 21లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకొని అందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఆయిల్ పాం సాగు పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించిన కలెక్టర్

2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.5290.33 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రకటించారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రూ.5290.33 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించారు. గతేడాది కంటే రూ.928.67 కోట్లు అధికమని, ఇందులో అత్యధికంగా రూ.3982.31 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించినట్లు కలెక్టర్ చెప్పారు. ఎంస్ఎంఈ కింద రూ.429.50 కోట్లు ప్రయారిటీ సెక్టార్ కింద విద్య, గృహ నిర్మాణానికి రూ.193.77 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతి తక్కువ డబ్బులతో అత్యధికంగా లబ్ధి చేకూరే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన బీమాను జిల్లాలోని బ్యాంక్ ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరికి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఏవో గోవిందనాయక్, డిప్యూటీ రీజినల్ అధికారి మురళీకృష్ణ, చీఫ్ మేనేజర్ లోకేషన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ కుమార్, డీఆర్‌డీవో ఉమాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీసీకి హాజరైన కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

లాభసాటి పంటలు పండించాలి

కొత్తకోట, జూన్ 24 : రైతు భరోసా డబ్బులను సద్వినియోగం చేసుకొని లాభసాటి పంటలు సాగు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. రైతు పండుగ సంబురాల్లో భాగంగా కలెక్టర్ మండలంలోని అమడబాకుల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. వనపర్తి జిల్లాలోని 1,96,683రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేశామని, సాంకేతిక కారణం లేదా మరే ఇతర కారణాల వల్ల డబ్బులు రాని వారు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో గోవిండ్ నాయక్, ఉద్యాన శాఖ అధికారి విజయ భాస్కర్, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, ఏవో జాస్మిన్, టెక్నికల్ ఏవో మాధురి, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

గద్వాల, జూన్ 24 : ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. హైదరాబాద్ నుంచి సీఎస్ ప్రభుత్వ కార్యక్రమాలపై మంగళవారం కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఆన్‌లైన్ నుంచి మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. వనమహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్‌పాం పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సీఎస్ చర్చించారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ 2.30లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జీలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వనమహోత్సవం కింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కలు పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేక మైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కోఆర్డినేట్స్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయిల్‌పాం సాగుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆగస్టు 15వ తేదీ నాటికి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకో వాలని జిల్లా వైద్యాధికారులకు సూచించారు. వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 5,585 దరఖాస్తులను భూభారతి రెవెన్యూసదస్సుల ద్వారా స్వీకరించామని, 4588 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 111 దరఖాస్తులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కింద జిల్లాలో 7వేలకు గాను 6,488 దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. కొన్ని బేస్‌మెట్ లెవల్, మరికొన్ని రూఫ్‌లెవల్, కొన్ని స్లాబ్ లెవల్ పనులకు డబ్బులు చెల్లించినట్లు చెప్పారు. పనులన్నీ పురోగతిలో ఉన్నట్లు ఆయన సీఎస్‌కు తెలియ జేశారు. వీసీలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో అలివేలు, అధికారులు సక్రియనాయక్, కాశీనాథ్, పర్వేజ్ ఆహ్మద్, అక్బర్‌పాషా, రమేశ్‌బాబు, డాక్టర్ సిద్ధప్ప పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు

రూ. 244కోట్ల రైతు భరోసా నిధులు జమ

- కలెక్టర్ సంతోష్

గద్వాల, జూన్ 24 : రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వానకాలం సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయాన్ని జిల్లాలో భూమి కలిగిన 1,64,436మంది రైతుల ఖాతాల్లో రూ.244,33,53,209 నిధులను జమ చేసినట్లు కలెక్టర్ సంతోష్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 1,83,830 మంది రైతులు ఉండగా, 198 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. మిగతా అర్హులైన రైతులకు త్వరలో వారి భూస్థితిని బట్టి నిధులు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ తరహా పథకాలు రైతుల జీవితాల్లో భరోసా నింపుతున్నాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

రైతులను నట్టేటా ముంచినందుకా రైతుపండుగ సంబురాలు ?

పాన్‌గల్, జూన్ 24 : కాంగ్రెస్ రైతుపండుగ సంబురాలు ఎందుకోసమని, రైతులను నట్టేటా ముంచినందుకా అని మాజీ జెడ్పీ టీసీ లక్ష్మి, బీఆర్ఎస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్ ప్రశ్నించారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండుగ పేరిట సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు విడుతలుగా భరోసా ఎగ్గొట్టిందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తాం.. ఎకరాకు రూ.15వేలు అని చెప్పి రూ.12వేలకు కుదించి ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. రూ.2లక్షలు రుణమాఫీ అని చెప్పి అరకొర చేసి ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఏకారణం చేత రైతు మరణిస్తే ఆ కుటుంబానికి ధీమాగా ఉండాలని రూ.5లక్షల సాయం అందించే రైతుబీమా రాకుండా చేసినందుకా? ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో దాదాపు 500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? పదేళ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసం నింపుకొని ఆత్మస్థైర్యంతో ఉన్న రైతులను 18నెలల పాలనలో నిండా ముంచి, వ్యవసాయం నడ్డివిరిచినందుకానని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన లో 18నెలల సమయంలోనే ప్రజలు విసిగెత్తిపోయారన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

గద్వాలటౌన్, జూన్ 24 : ఎంఎల్ హెచ్‌పీ సిబ్బంది సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని ఇన్‌చార్జి డీఎం హెచ్‌వో సిద్దప్ప అన్నారు. జిల్లాకేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బందిని ఉద్దేశించిన ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని సూచించారు. ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను ఆయూష్మాన్ ఆరోగ్య మందిర్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రసూనరాణి, సంధ్య కిరణ్మయి, రిజ్వానా తన్వీర్, రాజు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖి ఆలయానికి బస్సు సౌకర్యం

అయిజ, జూన్ 24 : కర్ణాటకలోని పంచముఖి ఆంజనేయస్వామి (గణదళం) ఆలయానికి బుధవారం నుంచి గద్వాల ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తోంది. ప్రతి అమావాస్యకు నడిగడ్డ నుంచి పంచముఖి ఆలయానికి భక్తులు విశేషంగా తరలివెళ్తుండటంతో భక్తుల సౌకర్యార్థం గద్వాల డిపో నుంచి డీలక్స్ బస్సును నడపనున్నట్లు డీఎం సునీత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు గద్వాల నుంచి బస్సు బయలుదేరుతుందని, 8 గంటలకు అయిజ, 9:30 గంటలకు పంచముఖి ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. బస్సు మూడు ట్రిప్పులు అయిజ నుంచి పంచముఖి ఆలయానికి వెళ్తుందని ఆమె తెలిపారు.

గడువు పొడిగింపు

గద్వాల రూరల్, జూన్ 24 : దివ్యాంగుల ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సునంద మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు http//tgobmms. cgg.gov. in ద్వారా తమ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

చేపపిల్లల బదులు నగదు ఇవ్వాలని సీఎంకు లేఖ

పెబ్బేరు, జూన్ 24 : మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల మత్స్య సహకార సంఘాల సభ్యులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు సీఎం కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖ పంపారు. చేప పిల్లల పంపిణీ ద్వారా అవకతవకలు జరుగుతున్నందున సంఘాలకు నగదును పంపిణీ చేస్తే వారే చేప పిల్లలను కొనుగోలు చేసుకొని చెరువుల్లో వదులుకుంటారని వారు చెప్పారు. యాపర్ల, అయ్యవారిపల్లి, సూగూరు, కంచిరావుపల్లి, వెంకటాపురం, జానంపేట సంఘాల సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంకు లేఖను పంపుతున్న మత్స్యకారులు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ టాటాబాబు

మత్తుపదార్థాలతో భవిష్యత్ నాశనం

వడ్డేపల్లి, జూన్ 24 : శాంతినగర్‌లోని శివశివాణి పాఠశాలలో మంగళవారం మత్తుపదార్థాల నిషేధంపై సీఐ టాటాబాబు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని, భవిష్యత్ పాడవుతుందని, వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. అనంతరం ఎస్సై నాగశేఖర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఈశ్వరి, శ్యాం సుందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో మెదడు మొద్దుబారుతుంది

అలంపూర్, జూన్ 24 : మాదక ద్రవ్యాలు మానవ మెదడును స్థిరంగా ఉంచక మొద్దుబారుస్తుందని విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని అలంపూర్ సీఐ రవి బాబు అన్నారు. మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు ఒకసారి అలవాటైతే ఎంతటి వారినైనా బానిసలుగా మారుస్తుందన్నారు. ముఖ్యంగా యువత బంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని డ్రగ్స్‌కు అలవాటు కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. మాదక ద్రవ్యాలను వినియోగించమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, శిక్షణ ఎస్సై నిమ్మల కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మల్దకల్, జూన్ 24 : విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని ఎంతోవో సురేశ్ సూచించారు. మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంతోవో హాజరై మాట్లాడారు. షీటీం సభ్యురాలు దివ్య మాట్లాడుతూ విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు , వాటిని నిర్మూలన చేసే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేషన్న, కానిస్టేబుల్ యశ్వంత్, దివ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

అయిజ మండలంలో..

అయిజ, జూన్ 24 : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తుకు దూరంగా ఉంటూ విద్యలో రాణిస్తూ చక్కటి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుదార్థాల జోలికి వెళ్లవద్దు

ఇటిక్యాల, జూన్ 24: మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని కోదండాపురం ఎస్సై మురళీ సూచించారు. మంగళవారం కోదండాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

గట్టు, జూన్ 24 : ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి శివారులో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం..గొర్లఖాన్‌దొడ్డికి చెందిన కుర్వ బజారి తన పొలంలో నారుమడిని వేయడానికి ప్రభాకర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. ఊరు బయట వరకు ట్రాక్టర్‌ను బజారి నడపాడు. అనంతరం తన స్నేహితుడు వీరేశ్ కోరిక మేరకు డ్రైవింగ్ చేయడానికి ట్రాక్టర్‌ను అతడికి అప్పగించాడు. ఈ క్రమంలో నెట్టెంపాడు కాల్వ సమీపంలో వీరేశ్ ట్రాక్టర్‌ను నడుపుతుండగా అది అదుపు తప్పి కాల్వలోకి పడిపోయింది. ఈ ఘటనలో వీరేశ్ గాయాలకు గురికాగా గద్వాల ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. బజారికి స్వల్ప గాయాలయ్యాయి.

ఈదురు గాలులకు విరిగిన కరెంట్ స్తంభం

కొత్తకోట, జూన్ 24 : మండలంలోని పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో పట్టణంలోని 13వ వార్డు వీవర్స్ కాలనీలో కరెంట్ స్తంభం విరిగి పడి కరెంట్ తీగలు ఆటో మీద పడడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని గుర్తించిన బీఆర్ఎస్ అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్ ఘటనా స్థలాన్ని చేరుకొని విద్యుత్ శాఖ కార్యాలయానికి సమాచారం అందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఈ మార్గాన బడిపిల్లలు, కళాశాలకు, ఇతరత్రా పనులకు వెళ్లే వారు చాలా మంది వెళ్తుంటారని, అందుకని ఇలాంటి చర్యలు జరగకుండా అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. అలాగే పట్టణంలో ఉన్న కరెంట్ స్తంభాల ను పరీక్షించి, మరమ్మతులు చేయించి తగు చర్యలు తీసుకోవాలని అధికార ప్రతినిధులను ప్రశాంత్ కోరారు.

శాంతి భద్రతల కోసమే పోలీస్ కవాతు

అమరచింత, జూన్ 24: మత కలహాలు, ఆందోళనలను నిరోధించి ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించేందుకే రాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీస్ కవాతు చేపడుతున్నామని ఆత్మకూర్ సీఐ శివకుమార్, ఆత్మకూర్, అమరచింత ఎస్సైలు వాకిటి నరేందర్, బండారి సురేశ్‌లు పేర్కొన్నారు. ఆత్మ కుల్, అమరచింత మండల కేంద్రాల్లోని మంగళవారం పుర వీధుల గుండా యాభై మంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీం పోలీసులతో కలిసి పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించేందుకు నిరంతరం పని చేయడమే పోలీసుల కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కుల్, అమరచింత పోలీస్ సిబ్బంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదానికి పాడె కట్టాలి

వనపర్తి టౌన్, జూన్ 24: తమ ఆయుధాల వ్యాపార విస్తరణ కోసం దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్స హిస్తున్న అ